# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం । 17 । జూన్ । 2026 పేజీలు: 8


## విష జ్వరాలపై యుద్ధం



ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలను విజయవంతం చేయాలి. డాక్టర్ సుధాకర్.

3

# రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో కామారెడ్డి రాష్ట్రంలో నం.1



- అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషి, అంకితభావం వల్లే ఈ ఘనత.
- రక్తదానం మహాదానం.. స్వచ్ఛందంగా ముందుకు రావాలి.. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.
- అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవంన కలెక్టరేట్లో ఎక్సైజ్ శాఖ రక్తదాన శిబిరం.
- రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణదానం చేసినట్టే.. కలెక్టర్

2

*భారత రెడ్క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి, అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభించిందన్నారు.*



### పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టిన వ్యక్తికి

# శిక్ష పడాలి

**- ఎంపీ అరవింద్**

ఆర్మూర్, జూన్ 16 (మనం న్యూస్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో గత 10 రోజుల క్రితం అప్పు ఇచ్చి తిరిగి అడిగినందుకు రాజమల్లు ఇల్లుని నిప్పు పెట్టి దగ్ధం చేసిన సంఘటన విషయం తెలుసుకున్న ఎంపీ అరవింద్, పిప్రి గ్రామానికి వెళ్లి ఇల్లును పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబానికి ఆయన తనవంతుగా లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. పదివేల కుటుంబాలు ఉన్న గ్రామంలో ఒక ఉన్న ముస్లిం వ్యక్తి ఇంట్లో కుటుంబం మొత్తం ఉండగా ఇంట్లోకి పెట్రోల్ తీసుకువచ్చి పెట్రోల్ పోసి నిప్పు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు 25 లక్షల నష్టం జరిగితే 13 లక్షలు ఎలా ఇప్పిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను గ్రామం నుండి వెళ్ళగొట్టకుండా ఇంకా ఊరిలోనే అంటిపెట్టుకొని ఉంచుకోవడం హిందువులకు మంచిది కాదని అన్నారు. ఇలాగే ముస్లింలను అక్కున చేర్చుకుంటే మరో బెంగాల్ ను తయారు చేస్తారని తెలిపారు.



2

## బీజేపీ-బీఆర్ఎస్ రైతు వ్యతిరేక పార్టీలే

**- ఎమ్మెల్యే భూపతి రెడ్డి**

## యూరియా యాప్ రద్దు చేయాలి.. లేదంటే ఉద్యమం ఉధృతం



2

- పోచంపాడు ఎక్స్‌రోడ్ వద్ద బీఆర్ఎస్ ధర్నా.
- రైతుల ఇబ్బందులపై ఆగ్రహం.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా బుకింగ్ యాప్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పోచంపాడు ఎక్రోస్డ్ వద్ద ధర్నా నిర్వహించారు. యాప్ కారణంగా రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక సమస్యల వల్ల పలువురు రైతులు యూరియా పొందలేకపోతున్నారని నాయకులు ఆరోపించారు.

# రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో కామారెడ్డి రాష్ట్రంలో నం.1

**- అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషి, అంకితభావం వల్లే ఈ ఘనత.**
**- రక్తదానం మహాదానం.. స్వచ్ఛందంగా ముందుకు రావాలి.. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**
**- అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవంన కలెక్టరేట్లో ఎక్సైజ్ శాఖ రక్తదాన శిబిరం.**
**- రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణదానం చేసినట్టే.. కలెక్టర్**



కామారెడ్డి, జూన్ 16 (మనం జిల్లా ప్రతినిధి): భారత రెడ్క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి, అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభించిందన్నారు. ప్రతి శాఖ అధికారి, ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించి సభ్యత్వ నమోదును విజయవంతం చేశారని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు వచ్చిన ఈ గుర్తింపును నిలబెట్టుకోవడం కోసం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**సభ్యత్వ నమోదు జూలై 31 వరకు**

సభ్యత్వ నమోదు గడువును జూలై 31 వరకు పొడిగించిన నేపథ్యంలో ఇంకా పెండింగ్లో ఉన్న నమోదులను త్వరితగతిన పూర్తి చేసి జిల్లాను మరింత ముందంజలో నిలపాలని సూచించారు. ఇప్పటివరకు అందించిన సహకారానికి అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపిన కలెక్టర్, ఇదే ఉత్సాహం, నిబద్ధతతో కార్యక్రమాన్ని కొనసాగించి కామారెడ్డిని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని 25వ గదిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు.

**రక్తదానంపై మరింత అవగాహన కల్పించాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణదానం చేసినట్లేనని అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి సేవ చేయాలని కోరారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర పరిస్థితుల్లో రక్త నిల్వలు అందుబాటులో ఉండేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. రక్తదానం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని, ఇది పూర్తిగా సురక్షితమైన, మానవతా దృక్పథంతో కూడిన సేవ అని తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎక్సైజ్ శాఖ సిబ్బందిని అభినందించిన కలెక్టర్, సమాజంలో రక్తదానంపై మరింత అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# బీజేపీ-బీఆర్ఎస్ రైతు వ్యతిరేక పార్టీలే



**- ఎమ్మెల్యే భూపతి రెడ్డి**
**- జిల్లాలో యూరియా కొరత లేదు..**
**- 28 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి.**

నిజామాబాద్ రూరల్, జూన్ 16 (మనం న్యూస్): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రైతుల పక్షాన ఎన్నడూ నిలబడలేదని, రైతుల పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ., బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు రైతుల నుంచి స్పందన లేకపోవడంతో కొందరు నాయకులు మిలిటెంట్ కార్యక్రమాలను ప్రోత్సహించేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో ప్రస్తుతం 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు 39 వేల మంది రైతులకు 3.78 లక్షల యూరియా బస్తాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. యూరియాను శాస్త్రీయ పద్ధతిలో, అవసరమైన మోతాదులోనే వినియోగించేందుకు ప్రభుత్వం యాప్ విధానాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. యాప్ ద్వారా తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, పట్టాదారు పాస్బుక్ లేని రైతులకు మండల రెవెన్యూ అధికారుల ద్వారా యూరియా అందజేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని 207 కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతోందని, యూరియా సరఫరాపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. తెలంగాణకు అదనపు యూరియా కోటా కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సరైన సహకారం లభించడం లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ, బీఆర్ఎస్ల ఉమ్మడి లక్ష్యమని ఆరోపించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ నీట్ పేపర్ లీకేజీ అంశంపై మాట్లాడాలని, నిజామాబాద్ అభివృద్ధికి ఎనిమిదేళ్లలో చేసిన కృషిని ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రులపై ఆధారాలు లేకుండా అవినీతి ఆరోపణలు చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, మిలిటెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, సింగరేణిని తగలబెట్టాలని, రైళ్లు ఆపాలని పిలుపునివ్వడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజుగా, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా పనిచేస్తోందని, విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

---

# యూరియా యాప్ రద్దు చేయాలి లేదంటే ఉద్యమం ఉధృతం

**- పోచంపాడు ఎక్స్రోడ్ వద్ద బీఆర్ఎస్ ధర్నా.**
**- రైతుల ఇబ్బందులపై ఆగ్రహం.**



మెండోరా, జూన్ 16 (మనం న్యూస్): రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా బుకింగ్ యాప్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పోచంపాడు ఎక్స్రోడ్ వద్ద ధర్నా నిర్వహించారు. యాప్ కారణంగా రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక సమస్యల వల్ల పలువురు రైతులు యూరియా పొందలేకపోతున్నారని నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగంపేట శేఖర్ రెడ్డి మాట్లాడుతూ., యూరియా బుకింగ్ కోసం స్మార్ట్ఫోన్ తప్పనిసరి చేయడం గ్రామీణ రైతులకు భారంగా మారిందన్నారు. ముఖ్యంగా మహిళా రైతులు, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు ఓటీపీలు, ఆన్లైన్ బుకింగ్ ప్రక్రియలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు సులభంగా ఎరువులు అందేలా గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూరియా పంపిణీలో పారదర్శకత ఉండాలే గానీ రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలు అమలు చేయకూడదన్నారు. యాప్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూరియా సరఫరా విషయంలో రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



# విష జ్వరాలపై యుద్ధం



**- ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలను విజయవంతం చేయాలి.**

**- డాక్టర్ సుధాకర్.**

రెంజల్, జూన్ 16 (మనం న్యూస్): జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సిబ్బంది సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి వారం మంగళవారం, శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాలను నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ముందస్తు



నివారణ చర్యలపై విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీల సహకారంతో గ్రామాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, గ్రామాల సమీపంలో చెత్త, పెంటకుప్పలు పేరుకుపోకుండా చూడాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని, అవసరమైన వారికి అందించేందుకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ సహిస్తా ఫిర్దోస్, ఆరోగ్య విస్తరణ అధికారులు కరిపే రవీందర్, సురేష్, పిహెచ్ఎన్ శాంతకుమారి, ఉజుమా, స్వరూపతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన గ్రామస్తులు

ఆర్మూర్, జూన్ 16 (మనం న్యూస్): నందిపేట్ మండలంలోని ఆంధ్ర నగర్ గ్రామంలో చెట్ల నరికివేత పై గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యాఖ్యలను మంగళవారం ఖండించారు. ఆంధ్రనగర్ గ్రామస్తులకు రాజకీయాలతో అనవసరమని చెప్పుకొచ్చారు.విషపూరిత మొక్కలతో క్యాన్సర్ వస్తుందని డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను, వైకుంఠధామంలో ఉన్న చెట్లను తొలగించాలని గ్రామస్తులుగా మహిళా సర్పంచ్ కు, పాలకవర్గానికి వినతి పత్రాన్ని అందించి గోడును చెప్పుకున్నామన్నారు. వైకుంఠధామంలో శవయాత్రకు వెళ్తే వృక్షాలుగా మారిన విషపూరిత చెట్లు ఉండి పందులు, కుక్కలు దాడి చేసిన సందర్భాలు ఉన్నందున తొలగించారన్నారు. ఆంధ్ర నగర్ సమస్యలను పరిష్కరించేందుకే ఒక మహిళను సర్పంచ్ గా ఎన్నుకున్నామని చెప్పారు. రాజకీయాలతో తమకు పనిలేదని, గ్రామాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లాలని సర్పంచును, పాలకవర్గానికి వైకుంఠధామంలో పండ్ల మొక్కలను పెంచాలని కోరుతున్నారు.

## గ్రామపంచాయతీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు



రుద్రూర్, జూన్ 16 (మనం న్యూస్) : శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ (దుబ్బాక)వారి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయాలల్లో స్వామి వారికీ సింధూర అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది యువకులు, స్వామి వారి భక్తులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం హనుమాన్ మందిరం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, బ్లడ్ ఫౌండర్ సంతోష్, స్వామి వారి భక్తులు వడ్ల నరేష్, రమణ గౌడ్, గుండూరి శ్రీకాంత్ గౌడ్, తెల్ల గోపి, కుమ్మరి గణేష్, వెంకటేష్, శివ, బందెల రాజశేఖర్, దుర్కి సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కృత్రిమ మేధా తరగతులకు మోర్తాడ్ అధ్యాపకులు

మోర్తాడ్, జూన్16 (మనం న్యూస్): మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న పలువురు అధ్యాపకులు కృత్రిమ మేధా శిక్షణా తరగతులకు నోడల్ అధికారులుగా నియమించబడ్డారని మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి పెద్దన్న తెలిపారు. విద్యార్థులను భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేసేందుకు గాను ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా భీంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల కృతిమ మేధా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా తమ కళాశాలకు చెందిన బ్యులా రాజయ్య శ్వేత అధ్యాపకులు శిక్షణా తరగతుల పాల్గొన్నారు. నోడల్ అధికారులుగా శిక్షణ పొందిన అధ్యాపకులు కృత్రిమమేదాను విద్య వృత్తి జీవితాల్లో సమర్థవంతంగా బాధ్యతగా నిర్వహించుకునే విధంగా అవగాహన కల్పిస్తారని అన్నారు. వీరి ఆధ్వర్యంలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఇస్తారని జూలై 1 నుండి శిక్షణ పొందిన విద్యార్థులు పలు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు డిజిటల్ భోదనలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.



## యూరియా కోసం రైతుల పడిగాపులు

**- యాప్ లోపాలతో అవస్థలు.**

**- సర్వర్ డౌన్తో గంటల తరబడి నిరీక్షణ.**

**- బుకింగ్ పూర్తికాక రైతుల ఆందోళన**

**- వానాకాల సాగులో ఎరువుల కొరత భయం.**

**- సహకార సంఘాల ద్వారా నేరుగా పంపిణీ చేయాలని విజ్ఞప్తి.**



నాగిరెడ్డిపేట్, జూన్ 16 (మనం న్యూస్): మండలంలోని కిచ్చన్నపేట్ సహకార సంఘం (తాండూర్ సొసైటీ) పరిధిలో యూరియా ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆన్లైన్ బుకింగ్ విధానం సాంకేతిక సమస్యలతో సతమతమవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.యాప్లో బుకింగ్ చేసేందుకు ప్రయత్నించిన ప్రతిసారి సర్వర్ డౌన్ అవుతుండటంతో రైతులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఎప్పుడు బుకింగ్ ప్రారంభమవుతుందో స్పష్టమైన సమాచారం లేకపోవడంతో రైతులు నిరంతరం మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నారు. కొన్నిసార్లు యాప్ తెరుచుకున్నా, వివరాలు నమోదు చేసేలోపే స్టాక్ పూర్తయినట్లు సందేశాలు రావడంతో నిరాశ చెందుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు సాంకేతిక పరిజ్ఞానం లేక ఇబ్బందులు పడుతుండగా, పలుమార్లు నమోదు చేసిన వివరాలు మాయమవడంతో మళ్లీ మొదటి నుంచి ప్రక్రియ ప్రారంభించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం వానాకాల సాగు పనులు ఊపందుకున్న నేపథ్యంలో యూరియా అత్యవసరంగా అవసరమని రైతులు చెబుతున్నారు. సమయానికి ఎరువులు అందకపోతే పంటల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.యాప్లో బుకింగ్ పూర్తయిన వారికి మాత్రమే యూరియా అందుతుండటంతో సాంకేతిక సమస్యల కారణంగా అనేక మంది రైతులు ఎరువులకు దూరమవుతున్న పరిస్థితి నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి యాప్లోని లోపాలను సరిదిద్దడంతో పాటు సహకార సంఘాల ద్వారా నేరుగా యూరియా పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తాండూర్ సొసైటీ పరిధిలో యూరియా నిల్వలను పెంచి రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రైతులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# మోర్తాడ్‌లో ఘనంగా జయదేవ్ ఎనిమిదవ వర్ధంతి



మోర్తాడ్, జూన్ 16 (మనం న్యూస్): మోర్తాడ్ మండల కేంద్రంలోని జయదేవ్ 8వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి మంగళవారం టియుఎఫ్ పూలమాల లేసి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ తొలితరం యోధుడు ప్రజా మేధావి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విషాష్ట పాత్ర పోషించిన ఉద్యమకారుడు మేధావి సామాజిక చైతన్య వేత ఆ మహనీయుని పోరాటం త్యాగం మరువలేనిదని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యత వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ మండల అధ్యక్షులు నరసయ్య, ఉపాధ్యక్షులు డి బాబురావు, ప్రధాన సలదారులు రాజారాం పాల్గొన్నారు.

# ఖరీఫ్ వరి నాట్లకు శ్రీకారం

- సన్నరకం సాగుపై రైతుల ఆసక్తి



నిజామాబాద్ రూరల్ , జూన్ 16 (మనం న్యూస్): సిరికొండ మండలంలోని కొండూరు గ్రామంలో ఖరీఫ్ సీజన్ వరి నాట్ల కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు అధిక దిగుబడి, నాణ్యమైన ధాన్యం అందించే సన్నరకం వరి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన యువరైతు లింభరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో 5204 బీపీటీ సన్నరకం వరి నాట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., మార్కెట్లో మంచి ధర లభించడంతో పాటు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో ఈ రకాన్ని సాగు చేస్తున్నట్లు తెలిపారు. వరి నాట్ల పనుల కోసం ఛత్తీస్గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో మండల వ్యాప్తంగా పొలాలు రైతుల సందడితో కళకళలాడుతున్నాయి. వర్షాలు సకాలంలో కురిస్తే రైతుల్లో కొత్త ఆశలు చిగురుస్తాయని అన్నారు. ఈ సీజన్లో మంచి దిగుబడులు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి టి. నర్సయ్య రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలతో సాగు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక సలహాలను వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.



# చిన్నారులకు అక్షరాభ్యాసం చేసిన కలెక్టర్

- అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.
- బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నోట్బుక్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ.
- ప్లాస్టిక్ వినియోగంతో నష్టాలపై ప్రజలకు అవగాహన.
- పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపు.



కామారెడ్డి, జూన్ 16 (మనం జిల్లా ప్రతినిధి): బడిబాట కార్యక్రమంలో భాగంగా లింగంపేట మండలం శెట్పల్లి జెడ్పీఎస్ఎస్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్బుక్స్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి పలకలు, బలపాలు అందజేశారు. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

**ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని సన్మానం**

ప్రభుత్వం ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు, అభ్యాస నైపుణ్యాల పెంపు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యా రంగంలో ప్రతిభ కనబరిచిన ఓ విద్యార్థినిని సన్మానించి అభినందించారు. అనంతరం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ, స్థానిక కిరాణా దుకాణాల యజమానులకు ప్రత్యామ్నాయ వినియోగ డబ్బాలు, టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో, డీఈఓ, ఎంపీడీఓతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత

- బుర్ర మత్తడిలో బోర్వెల్ పనులకు శంకుస్థాపన.
- తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం.. మున్సిపల్ చైర్పర్సన్ ఉమారాణి శ్రీనివాస్.
- కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ కాసార్ల గోదావరి స్వామి, కౌన్సిలర్లు.



కామారెడ్డి, జూన్ 16 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలోని బుర్ర మత్తడి ప్రాంతంలో చేపట్టనున్న బోర్వెల్ ఏర్పాటు పనులకు మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి ప్రాంతానికి సురక్షితమైన తాగునీటిని అందించడం మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బుర్ర మత్తడి ప్రాంతంలో కొంతకాలంగా నెలకొన్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని బోర్వెల్ ఏర్పాటు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బోర్వెల్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ కాసార్ల గోదావరి స్వామి, కౌన్సిలర్లు అంజాద్, జావీద్, సత్యం, లడ్డు, మజీద్, డీఈ హన్మంతరావు, ఏఈ వేణుప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. బోర్వెల్ పనులు త్వరగా పూర్తవడంతో తమ ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత

**- ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన లింగంపేట శెట్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి. నిఖిత.**

**- నిఖితకు అభినందించి 10 వేల ఆర్థిక సాహాయం చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**- ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకి కాకూడదు, అర్హులకు సహకారం అందించాలని పిలుపు.**

**- ఎక్సైజ్ శాఖ రక్తదాన శిబిరంలో 67 యూనిట్ల రక్తం సేకరణ, రక్తదాతలకు కలెక్టర్ సర్టిఫికెట్ల ప్రదానం.**

కామారెడ్డి, జూన్ 16 (మనం జిల్లా ప్రతినిధి): లింగంపేట్ మండలం శెట్పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఐఐఐటీ బాసరలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని డి. నిఖితను అభినందించారు.



ఉన్నత విద్యలో రాణించి జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థిని విద్యాభ్యాసానికి తోడ్పాటుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకి కాకూడదని కలెక్టర్ పేర్కొన్నారు.

**రెడ్ క్రాస్ సొసైటీ 67 యూనిట్ల రక్తం సేకరణ**




అనంతరం ఎక్సైజ్ శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సేకరించిన 67 యూనిట్ల రక్తదానానికి సంబంధించి దాతలకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో, ఎంఆర్వో, రెడ్ క్రాస్ ప్రతినిధులు ఎం. రాజన్న, ఏ. నాగరాజు గౌడ్, సంజీవరెడ్డి, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# భిక్నూర్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలి

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతి**

భిక్నూర్, జూన్ 16 ( మనం న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్ ని మంగళవారం హైదరాబాద్లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భిక్నూర్ మండల పరిధిలోని పలు ప్రజా సమస్యలను ఆయనకు వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. భిక్నూర్ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పలు అభివృద్ధి పనులను, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ సందర్భంగా షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఆయన, భిక్నూర్ ప్రాంత అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని, నిధుల మంజూరుకై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులను కలిసిన వారిలోబాల్యల సుదర్శన్ (బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు), లింబాద్రి (సిద్ధ రామేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్), రాజబాబు గౌడ్ (జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి), దుంపల మోహన్ రెడ్డి (ఉపసర్పంచ్), గంగల భూమయ్య (సింగిల్ విండో చైర్మన్), నీల అంజయ్య, ఉప్పరి సాయిలు, మైపాల్ రెడ్డి (సింగిల్ విండో డైరెక్టర్లు), నర్మాల రామచంద్రం, మద్దూరు రవి (కాంగ్రెస్ సీనియర్ నాయకులు)ఉన్నారు.



# గైని శ్రీనివాస్ గౌడ్ను కలిసిన టీఆర్ఎస్ నాయకులు

**- నియోజకవర్గ ఇంచార్జి గైని శ్రీనివాస్ గౌడ్కు సన్మానించిన, వేముల బలరాం, ఏర్కట్ల కిషన్.**

కామారెడ్డి, జూన్ 16 (మనం న్యూస్): కామారెడ్డి నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గైని శ్రీనివాస్ గౌడ్ను పార్టీ రాష్ట్ర నాయకులు వేముల బలరాం, జిల్లా నాయకులు ఏర్కట్ల కిషన్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కామారెడ్డి నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధి, రానున్న రాజకీయ కార్యక్రమాలపై నాయకులు చర్చించినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చుక్క సాయిగౌడ్, జిల్లా యువజన నాయకులు జొన్నల వినోద్, జొన్నల రాము తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూరియ అందరికి ఇస్తాం..

**- అపోహలు నమ్మకండి**

**- మండల వ్యవసాయ శాఖ.**

మోర్తాడ్, జూన్ 16 (మనం న్యూస్): మోర్తాడ్ మండలంలో ఎంతమంది రైతులు ఉన్నారో అందరికీ సరిపడా యూరియాను అందిస్తామని మండల వ్యవసాయ అధికారి హరీష్ స్పష్టం చేశారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో మండల వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా వ్యవసాయధికారి మాట్లాడుతూ., మోర్తాడ్ మండలంలో మొత్తం 8200 మంది రైతులు వున్నారని, ఇప్పటి వరకు యూరియా అప్ ద్వారా 4033 మంది రైతులు మాత్రమే బుక్ చేసుకున్నారని అందులో పేర్కొన్నారు. మండలంలో బుకింగ్ అప్ పది జూన్ లో ప్రారంభం అయిందని తెలిపారు. మండలంలోని రైతులకు వానకాలం పంటలకు యాభై వేల యూరియా బ్యాగ్స్ అవసరమని ఇప్పటి వరకు అప్ ద్వారా రైతులు బుక్ చేసుకున్న యూరియా బ్యాగ్స్ పదివేల 400 మాత్రమేనని అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ కొరకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ విధానం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఖరీఫ్ సీజన్ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నదని అందువల్ల మోర్తాడ్ మండలంలోని రైతులు ఎరువుల లభ్యత పైన ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. మండలానికి సరిపడా యూరియా సరఫరా రోజువారీగా జరుగుతున్నదని తెలిపారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుక్ చేసుకుంటే రైతుల సంఖ్య, సాగు భూమి యొక్క విస్తీర్ణం పరిగణలోకి తీసుకొనే అవకాశం వుంటుందని, దాని ప్రకారంగా యూరియాను ప్రతి రైతుకు అందించడం జరుగుతుందని అన్నారు. కావున రైతులు ఇప్పుడే పంటలు వేసే పనులలో వున్నారని కాబట్టి తొందరపాటుగా యూరియా రాదనే అపోహలకు గురి కాకుండా ఆప్లో దశలవారీగా బుక్ చేసుకొని యూరియాను తీసుకోవాలని వ్యవసాయ శాఖ కోరారు. మండలాన్ని ఒక యూనిట్ గా పరిగణించి ఎరువులు బుకింగ్ చేయడం జరుగుతుందని కావున రైతులు మండలంలోని సొసైటీలు మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియాను బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. పంటకు అవసరమున్న దానినిబట్టి యూరియాను బుక్ చేసుకోవాలని, ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులందరికీ సరిపడా యూరియా అందించేలా చర్యలు తీసుకోడం జరిగిందని తెలిపారు. అదనంగా యూరియా బుక్ చేసుకోవద్దని రైతులను కోరారు.






# బీసీ ముస్లిం సర్పంచులకు ఆత్మీయ సత్కారం

మెండోరా, జూన్ 16 (మనం న్యూస్): బీసీ టైమ్స్ మరియు బీసీ సమాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన బీసీ ముస్లిం సర్పంచులకు మంగళవారం హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం, మెండోరా మండలం దూదిగాం గ్రామానికి చెందిన సర్పంచ్ బాబాను ప్రత్యేకంగా సత్కరించారు. గ్రామీణ స్థాయిలో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ, సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న బీసీ ముస్లిం ప్రజాప్రతినిధిగా ఆయన సేవలను గుర్తించి శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా అభినందించారు.

# రక్షణరంగంలో చేరి దేశసేవలో భాగస్వాములు కావాలి










**- ఆర్మీపై అవగాహన పెంపుకు ఉదయ డిఫెన్స్ అకాడమీ సదస్సు.**

**- జ్యోతి ప్రజ్వలన చేసిన మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**

**- యువత రక్షణ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.. చైర్పర్సన్.**

కామారెడ్డి, జూన్ 16 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఉదయ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'ఆర్మీ అవగాహన మరియు అభినందన సదస్సు' ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., దేశ భద్రత కోసం భారత సైనికులు చేస్తున్న త్యాగాలు, సేవలు ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించేందుకు ఉదయ డిఫెన్స్ అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన వంటి రక్షణ రంగాల్లో ఉన్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని దేశ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### దేశ రక్షణలో సైనికుల త్యాగాలు, సేవలు ఆదర్శప్రయం

దేశ రక్షణలో సైనికుల పాత్ర అత్యంత కీలకమని, వారి సేవలను గుర్తిస్తూ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు రక్షణ రంగంపై ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా చైర్పర్సన్ జై జవాన్ - జై కిసాన్ నినాదంతో సభికులను ఉత్తేజపరిచారు. సదస్సులో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ కాసార్ల గోదావరి స్వామి, ఆర్కే గ్రూప్ ఆఫ్ సీఈఓ జైపాల్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, రోటరీ క్లబ్ కార్యదర్శి కృష్ణహరి, బీసీ సంఘం అధ్యక్షుడు నీలం నాగరాజు, మాజీ సైనికుడు సాయిరెడ్డి, అకాడమీ డైరెక్టర్ రాజేశ్వర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భారత సైన్యం సేవలను కొనియాడుతూ యువతకు అవగాహన కల్పించారు.




## తెలంగాణ విశ్వవిద్యాలయంలో 'నిజామాబాద్ జిల్లా స్త్రీల సాహిత్యం' పుస్తకావిష్కరణ

**- మహిళా రచయిత్రుల సాహిత్యానికి విలువైన దస్తావేజు.**

**- ప్రొఫెసర్ కాశీం.**

నిజామాబాద్ రూరల్ , జూన్ 16 (మనం న్యూస్) : తెలంగాణవిశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో పార్టైమ్ లెక్చరర్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్. సాయిలక్ష్మి రచించిన నిజామాబాద్ జిల్లా స్త్రీల సాహిత్యం - ఒక పరిశీలన పుస్తకాన్ని మంగళవారం తెలంగాణ విశ్వవిద్యాలయం ఆరట్స్ అండ్ సోషల్ సైన్సెస్ కళాశాల మినీ సమావేశ మందిరంలో ఘనంగా ఆవిష్కరించారు. డాక్టర్ సాయిలక్ష్మి 2021లో పూర్తి చేసిన పీహెచ్డీ పరిశోధనా గ్రంథాన్ని పుస్తక రూపంలో ప్రచురించగా, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ ఆచార్యులు ప్రొఫెసర్ కాశీం చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ., నిజామాబాద్ జిల్లాకు చెందిన మహిళా రచయిత్రుల సాహిత్య ప్రస్థానం, వారి రచనా విధానం, వస్తు నేపథ్యం, సామాజిక దృక్పథాన్ని సమగ్రంగా విశ్లేషిస్తూ రూపొందించిన ఈ గ్రంథం పరిశోధకులకు, సాహిత్యాభిమానులకు విలువైన ఆధార గ్రంథంగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో మహిళా సాహిత్యాన్ని నమోదు చేసిన అరుదైన పరిశోధనగా ఇది గుర్తింపు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ప్రొఫెసర్ పి. కనకయ్య, ఆచార్య కే. లావణ్య, ప్రస్తుత వైస్ ప్రిన్సిపల్ డా. లక్ష్మణ చక్రవర్తి, డా. రమణాచారి, డా. పున్నయ్య, డా. మొహమ్మద్ మూసా ఖురేషి, పార్టైమ్ లెక్చరర్లు డా. పుప్పాల రవీందర్, డా. జె. మహేందర్తో పాటు అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ సందర్భంగా డాక్టర్ ఆర్. సాయిలక్ష్మిని అధ్యాపకులు అభినందించి, ఆమె మరిన్ని సాహిత్య, పరిశోధనా రచనలు చేయాలని ఆకాంక్షించారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కలెక్టర్ సేవలు

**- జిల్లా కలెక్టర్గా ఆశిష్ సాంగ్వాన్ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి**

**- ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలనలో ప్రత్యేక గుర్తింపు.**

**- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చర్యలు.**

**- క్షేత్రస్థాయి తనిఖీలతో సమస్యల పరిష్కారం.**

**- క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత, క్రీడాకారులకు నిరంతర ప్రోత్సాహంతో పాటు సహకారం.**



కామారెడ్డి, జూన్ 16 (మనం జిల్లా ప్రతినిధి): కామారెడ్డి జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా అధికారులు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ను మంగళవారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. రెండేళ్ల కాలంలో జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలులో కలెక్టర్ ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ ప్రజలకు చేరువయ్యారు.

### విద్యా ప్రోత్సాహక కార్యక్రమాల అమలు

వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, ఎన్నికల నిర్వహణ తదితర రంగాల్లో సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తున్నారు. గ్రామాల సందర్శనలు, క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహించడం, విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేయడం ద్వారా యువతకు స్ఫూర్తిగా నిలిచారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవకు ప్రజలు, అధికారులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

## నడిమి తాండ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

మెండోరా, జూన్ 16 (మనం న్యూస్): మెండోర మండలంలోని నడిమి తాండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని నడుమితాండ గ్రామ సర్పంచ్ బనావత్ రవి నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ నాయక్, తాండ పెద్దమనిషి గణేష్ ప్రతాప్, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు, చిన్నారుల రక్షణకు శాఖల సమన్వయం కీలకం

**- భరోసా సెంటర్ ఆధ్వర్యంలో తొలిసారిగా కో-ఆర్డినేషన్ సమావేశం.**

నిజామాబాద్, జూన్ 16 (మనం బ్యూరో): మహిళలు, చిన్నారుల రక్షణ, సంక్షేమం మరియు బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మంగళవారం భరోసా సెంటర్, న్యాయ శాఖ, చైల్ వెల్ఫేర్, ఆరోగ్య శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం జిల్లాలో తొలిసారిగా నిర్వహించడం విశేషం. సమావేశంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు, బాధితులకు అందించాల్సిన న్యాయ సహాయం, వైద్య సేవలు, కౌన్సెలింగ్, పునరావాస చర్యలు, కేసుల విచారణలో అనుసరించాల్సిన విధివిధానాలు, శాఖల మధ్య సమాచార మార్పిడి వంటి కీలక అంశాలపై సవివరంగా చర్చించారు. బాధితులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందేలా భరోసా సెంటర్ ద్వారా చేపడుతున్న చర్యలను సమీక్షించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ మాట్లాడుతూ., మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులు మానసికంగా, శారీరకంగా,





సామాజికంగా కోలుకునేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి కేసును సున్నితంగా పరిశీలిస్తూ బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చైల్ వెల్ఫేర్, న్యాయశాఖ, వైద్యశాఖ ప్రతినిధులు తమ శాఖల ద్వారా అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై వివరించారు. బాధితులకు నాణ్యమైన సేవలు అందించడంలో శాఖల మధ్య సమన్వయం కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సమన్వయ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి మహిళలు, చిన్నారుల రక్షణకు మరింత సమర్థవంతమైన వ్యవస్థను రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీసీఆర్బీ సీఐ పాండే రావు, ఎస్త్స వరప్రసాద్ రెడ్డి, ఫోక్సో కోర్టు ఇన్చార్జి పీపీ జి. నరసింహారెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్కుమార్ సుబేదార్, చైల్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు శోభారాణి, జిల్లా ప్రొబేషన్ అధికారి పవన్ కళ్యాణ్, చైల్ లైన్ కోఆర్డినేటర్ జ్యోత్స్న, డాక్టర్ వెంకటేష్, డీసీపీఓ చైతన్య, భరోసా సెంటర్ ఇన్చార్జి మహిళా ఎస్త్స పుష్పావతి, రోజా తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

**- సాటాపూర్ పాఠశాలలో ఘనంగా పాఠ్యపుస్తకాల పంపిణీ.**

**- మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షురాలు, గ్రామ సర్పంచ్ లచ్చావార్ సుహాసిని నితిన్ ఆధ్వర్యంలో కార్యక్రమం.**

**- ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు పుస్తకాల అందజేత.**

రెంజల్, జూన్ 16 (మనం న్యూస్) : రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షురాలు లచ్చావార్ సుహాసిని నితిన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లచ్చావార్ సుహాసిని నితిన్ మాట్లాడుతూ., విద్యార్థులు పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి మాట్లాడుతూ., విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో గొప్పదని, ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు.

ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, గంగారాం, పరశురాం, పద్మలత, సంధ్య శ్రీ, విజయ తదితరులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తూ విద్యాభ్యాసంలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చైర్పర్సన్ జన్మదిన వేడుకల్లో

# అన్నప్రసాద వితరణ

**- మున్సిపల్ చైర్పర్సన్ ఉమారాణి శ్రీనివాస్ పేరిట 350 మందికి అన్నప్రసాదం.**

**- ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన శక్తి ప్రసాదించాలని పూజలు.**

**- సేవా కార్యక్రమంలో పాల్గొన్న పరంజ్యోతి భగవతి ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్, డాక్టర్ బాలు.**




కామారెడ్డి, జూన్ 16 (మనం న్యూస్): కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 350 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్, డాక్టర్ బాలు మాట్లాడుతూ., ప్రజాసేవలో ముందుండే మున్సిపల్ చైర్పర్సన్ ఉమారాణి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన శక్తి, సంకల్పం ఆమెకు కలగాలని ఆకాంక్షిస్తూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమాజ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని కోరుతూ భగవతి అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు, నిరుపేదలు, స్థానికులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమిరిశెట్టి దిగంబర్, దొంతి సుధాకర్, రాజమణి, పప్పుల శ్రావణి, పాత స్వరూప, నీల అద్విక్ సాయి, నీల సాయి అద్వైత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అన్నదాన కార్యక్రమం పట్ల భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# యూరియా యాప్ రద్దు చేయాలని రైతుల రాస్తారోకో

**– బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద ఆందోళన.**







నిజామాబాద్ రూరల్, జూన్ 16 (మనం న్యూస్) యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, గతంలో మాదిరిగా రైతులకు నేరుగా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ సిరికొండ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద మంగళవారం రూరల్ బి ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జ్ బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ పలువురు రైతులు పాల్గొన్నారు. యాప్ విధానం కారణంగా గ్రామీణ ప్రాంత రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులకు యూరియా పొందడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ విధానాన్ని ఎత్తివేసి, గతంలో అమలు చేసిన విధంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు యూరియా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న తరుణంలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్పల్లి సీఐ బిక్షపతి, సిరికొండ ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేపట్టి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రైతుల ఆందోళనతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం కలగగా, అనంతరం పోలీసులు, నాయకుల సూచనల మేరకు కార్యక్రమం శాంతియుతంగా ముగిసింది.



## ఖంజర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు ఎమ్మెల్యేకు సంప్రదాయ ఆహ్వానం

**– మతసామరస్యానికి ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు నిర్వహించాలి.**

**– ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి**

నిజామాబాద్ రూరల్, జూన్ 16 (మనం న్యూస్): మోపాల్ మండలంలోని ఖంజర్ దర్గా వద్ద ఈ నెల 21న నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ముస్లిం మతపెద్దలు మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ నాయకత్వంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ముస్లిం మతపెద్దలు, ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేసి సంప్రదాయబద్ధంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ముస్లిం మతపెద్దలు ఉర్సు ఉత్సవాల విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను ఎమ్మెల్యేకు వివరించారు. ఉర్సు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, అన్ని వర్గాల ప్రజలు కలిసి ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలను నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి మాట్లాడుతూ., మత సామరస్యం భారతీయ సంస్కృతికి మూలస్తంభమని పేర్కొన్నారు. హిందూ, ముస్లిం సోదరులు పరస్పర సహకారంతో, ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉర్సు ఉత్సవాలు విజయవంతంగా జరగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మోపాల్ మండల ముస్లిం మతపెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన రూరల్ ఎమ్మెల్యే





**– మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన.**

నిజామాబాద్ రూరల్, జూన్ 16 (మనం న్యూస్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న జక్రాన్పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మణ్ మాతృమూర్తిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మంగళవారం పరామర్శించారు. నిజామాబాద్ నగరంలోని మనోరమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం నూరిపోస్తూ, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే, బాధితురాలికి అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకుని ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రమాదం నుంచి పూర్తిగా కోలుకుని త్వరలోనే సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొలసాని శ్రీనివాస్, బోర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విశ్వవిద్యాలయ వీసీ, రిజిస్ట్రార్కు నాన్-టీచింగ్ సిబ్బంది వినతిపత్రం

**– ప్రమోషన్లు, బదిలీలపై సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**



నిజామాబాద్ రూరల్, జూన్ 16 (మనం న్యూస్): తెలంగాణ విశ్వవిద్యాలయం రెగ్యులర్ నాన్-టీచింగ్ సిబ్బంది సంఘం ( టి యు ఎన్ టి ఎస్ ఏ ) ఆధ్వర్యంలో మంగళవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరిలకు వినతిపత్రం సమర్పించారు. విశ్వవిద్యాలయంలో నాన్-టీచింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ వినతిపత్రంలో ప్రస్తావించారు. ముఖ్యంగా అర్హులైన ఉద్యోగులకు అంతర్గత ప్రమోషన్లు వెంటనే కల్పించాలని, చాలా కాలంగా ఒకే విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అంతర్గత బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే విశ్వవిద్యాలయ అభివృద్ధి, పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి నాన్-టీచింగ్ సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరిస్తారని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టుంట్సా సంఘం అధ్యక్షుడు బి. సాయిగౌడ్ (అసిస్టెంట్ రిజిస్ట్రార్), ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్ (సూపరింటెండెంట్), కార్యదర్శి బి. వినోద్ కుమార్ (అసిస్టెంట్ ఇంజనీర్), జాయింట్ సెక్రటరీ జ్యోతి ఉమారాణి (సూపరింటెండెంట్)తో పాటు పలువురు జూనియర్ అసిస్టెంట్లు, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.